



# ఇంద్రగంటి జానకీబాల

ఇంట్లోంచి బయటకొచ్చి, తలుపుదగ్గరికి లాగి, లోపల గడియవేసుకోమని ఓ కేక పెట్టి, రెండడుగులువేసి, తన చీరవైపు చూసుకుంది విమల. గంజిపెట్టి ఇస్త్రీ చేసిన చీర అందంగా అమరివుంది. పలకలు పరచినట్లు కుచ్చిళ్ళు బిగుతుగా, సాపుగా, ఆకర్షణీయంగా వున్నాయి. ఎప్పుడూ అదేవిధంగా నీట్‌గా బట్టలు వేసుకుని వెళ్ళడం అలవాటున్నప్పటికీ ఆ రోజు ఆ సన్నటి జరీ అంచుకోరా రంగు వెంకటగిరి చీర చూసుకుని మరీ మురిసిపోతోంది విమల.

ఇస్త్రీ చేయించడానికి రాజీ మూడుసార్లు తిరిగింది. అర్భకంగా సన్నని కాళ్ళూ చేతులూ ఊపుకుంటూ మాట నోట్లోంచి రాగానే పరుగెట్టే రాజీని చూస్తే విమలకి జాలిగానే వుంటుంది. అయినా మరి పనివున్నప్పుడు పరుగెట్టకపోతే ఎలా?

విమలకి సంతోషంగా, గర్వంగా వుంది. విచిత్రమైన ఆ మానసిక స్థితిని ఆమె కారణాలు చూపుతూ వివరించి చెప్పలేదు. గొప్పచీరలు కట్టుకోవడం, వాటిని అందంగా అమరినట్లు ప్రదర్శించటం ఆమెకి కొత్తేమీ కాదు. కొత్తమాయని చీరలు ఆమెకి కనీసం ఏభైకి

పైనే వుంటాయి.

చకచక విమల నడుస్తుంటే సముద్ర మధ్యంలోంచి సర్రున లేచి, తళుక్కుమనే షార్కు తోక లాగా చీర కుచ్చెళ్ళు కదులుతున్నాయి. గేటు తీసుకుని లోపలికెళ్తూ పద్మిని ఈపాటికి రెడీగా వుంటుందేమో అనుకుని కాలింగ్ బెల్ మోగించబోయి ఓరవాకిలిగా వేసున్న తలుపు తోసుకుని లోపలకడుగు పెట్టింది విమల.

అక్కడే సోఫాలో కూర్చున్న పద్మిని లేచి "రా రా నువ్వు వచ్చేస్తావనుకుంటూనే వున్నాను" అంటూ ఆప్యాయంగా చెయ్యిపట్టుకుంది. ఆ డ్రాయింగ్ రూంలోనే ఒక పక్కగా నేలమీద ఒక ఆడమనిషి కూర్చునుంది. ఆమె పక్కన సుమారు ఎనిమిదేళ్ళ పిల్ల మడకాళ్ళేసుకుని కూర్చుని, చేతులు నులుపుకుంటూ దిక్కులు చూస్తోంది. వాళ్ళని చూడగానే తెలుస్తుంది పట్టణ వాసపు పోకడలు బొత్తిగా ఎరుగని పచ్చి పల్లెటూరు మనుషులని–.

"ఒక్క పది నిముషాలు పదే నిముషాలు వచ్చేస్తాను" అంటూ విమలని లోపలికి తీసుకెళ్ళి డైనింగ్ టేబుల్ దగ్గర కుర్చీలో కూర్చోబెట్టి తను ముందు గదిలోకెళ్ళిపోయింది పద్మిని.

ముందుగదిలోంచి మాటలు బాగానే వినబడుతున్నాయి.

"ఊ... చెప్ప జల్దీ – నాకు చాలా పనుంది" అంది పద్మిని.

"నువ్వట్లసెప్తే నేనేం చెప్పను. పిల్ల చిన్నదైనా పని సక్కగ సేస్తుంది" అంది, ఆడమనిషి–, ఆ గొంతునిండా నమ్రత.

"నా కదేం చెప్పకు, పదేళ్ళయినా లేని పిల్ల ఎంత పనిచేస్తుందో నాకు తెలీదా" పద్మిని గొంతు జోరుగా వుంది.

"వచ్చే మాసంలో పదేళ్ళు నిండుతాయి"–

"ఏమో –, సన్నగావుంది, ఆ ఒక్క పిల్లతో నాకేం కుదరదు. మరో పని మనిషి లేకుండా జరగదు కదా"–

విమలకప్పుడు విషయం అర్థమైంది – కానీ పద్మిని ఇంట్లో అప్పటికే ఒక పన్నెండేళ్ళ పిల్ల పనిచేస్తోంది. ఆ ఇంట్లో పోచమ్మనే ఆ పిల్ల సమస్త పనులూ నిర్వహించగలదు.

అమ్మగారి కంటే ముందే నిద్రలేస్తుంది. బయట తుడిచి నీళ్ళు జల్లి ముగ్గువేస్తుంది. అంట్ల గిన్నెలు బయటేసుకుని, శుభ్రంగా తోమి కడిగి తెల్లని గుడ్డతో తుడిచి ఉదయపు టెండలో బోర్లిస్తుంది. అమ్మగారు, అయ్యగారు పడుకున్న గది తప్ప, అన్ని గదులు చీపురుతో తుడిచి తడిగుడ్డ వేస్తుంది. ఆరిన వంటసామాను ఇంట్లో అమరికగా సర్దుతుంది. గ్యాస్‌స్టవ్ వెలిగించి టీ పెట్టడానికి నీళ్ళు వేస్తుంది. అప్పటికీ అమ్మగారు లేవకపోతే చక్కగా టీ తయారు చేసి ఫ్లాస్కులో పోసి అమ్మగారి మెప్పు పొందుతుంది. దోసెల పిండిగానీ, ఇడ్లీల పిండిగానీ మెత్తగా రుబ్బుతుంది (పద్మినికి ఈ మిక్సీలలో వేసిన పిళ్ళంటే గిట్టదు).

ఇన్ని పనులు చేశాక పోచమ్మకి ఆకలిగా వుంటుంది. అయినా ఉత్సాహంగానే వుంటుంది. పద్మిని రాత్రి మిగిలిన అన్నం పెట్టినా, అప్పడే చేసిన టిఫిను పెట్టినా, పోచమ్మ తినగలిగినంతా కొసరి కొసరి పెడ్తుంది. మరి పోచమ్మ చేయగలిగినంత పనీ చేయ్యాలి కదా అంటుంది పద్మిని.

ఆ ఇంటికొచ్చి ఒక్క పూట వున్నవాళ్ళెవరైనా, పోచమ్మ ఆ యింట్లో పనిచేస్తున్న తీరుచూసి ఆనందపడటం కంటే ఈర్ష్యపడతారు. లోలోపల అలాంటి ఓ పని పిల్ల మనకీవుంటే ఎంత బాగుండును అని తప్పక ఆశపడతారు.

విమల ఎన్నోసార్లు అనుకుంది. రాజీ కూడా పని బాగానే చేసినా పోచమ్మతో పోలిస్తే తక్కువే– అని.

రాజీకి టి.వి.లు, సినిమాలు, పాటలు, డ్యాన్సులు కావాలి. కానీ పోచమ్మకలాంటివేమీ అంతగాపట్టవు. ఆమెకి తెలిసిందల్లా పనిచెయ్యడం ఒక్కటే. తిన్న ప్రతి మెతుకు నిముషంగా మార్చి పనిగా ఫలితాన్నిస్తుందామె. మరి అలాంటి వజ్రపు తునకలాంటి పోచమ్మవుండగా మళ్ళీ ఈ పిల్లెందుకూ అని ఆలోచిస్తుండగా ఆ పిల్ల చేతిలో ఒక మెత్తటి పాతగుడ్డ పట్టుకుని వచ్చి, అక్కడున్న ప్రతి వస్తువూ నెమ్మదిగా, జాగ్రత్తగా తుడవడం మొదలుపెట్టింది.

"హమ్మయ్య– అయింది' అంటూ వచ్చింది పద్మిని.

"అవును పద్మీ,– ఈ పిల్లా?"–

"ఉష్ చెప్తాలే– వాళ్ళని వెళ్ళనీ–" అంటూ వీధి గేటు వైపు రెండు మూడుసార్లు తొంగిచూసి "ఆ... ఏంలేదు. ఆ పిల్లనెక్కడైనా పెడదామని వాళ్ళమ్మ ఆశ"–

"నీకూ....."

"అవసరం వుందని కాదు. పని పిల్లలు దొరకడం ఎంతకష్టంగా వుందో తెలుసా. మా అన్నయ్యా, వదినా ఓ పిల్ల దొరికితే బాగుండుననుకుంటున్నారు–, అయినా వుంటుంది. మా వాళ్ళలో ఎవరో ఒకరికి–"

"ఎంత?"

"నెలకి ఏభై రూపాయలు. ఇక్కడే వుండిపోతుంది. అన్నీ మనమే. ఏడాదికి రెండుజతల బట్టలు. అవికాక మనింట్లో పిల్లల బట్టలుంటాయికదా–".

"ఎప్పడొస్తుంది"–

"రేపు తీసుకొచ్చి దింపి, ఎడ్వాన్సు కావాలట తీసుకెళ్తానంది" అని గొంతు తగ్గించి "ఇదీ –, ఈ పోచమ్మలేదూ, దానికి పన్నెండు విండాయి. రేపో మాపో... వాళ్ళమ్మ పెళ్ళీ గిళ్ళీ అందనుకో –, మనకే వుంటుంది" అంది కళ్ళు అటూ ఇటూ తిప్పతూ పద్మిని.

ఏమైనా ఇలాంటి వ్యవహారాల్లో పద్మిని చాలా తెలివైంది అనుకుంది విమల. విచిత్రమైన అసూయ మనసంతా వ్యాపించింది. పద్మిని పిల్లచేత పనిచేయించినట్లు ఎవ్వరూ చేయించలేరు. క్షణం ఆ పిల్లని

అమ్మగారి కంటే ముందే నిద్ర లేస్తుంది. బయట తుడిచి నీళ్లు జల్లి ముగ్గేస్తుంది. అంట్ల గిన్నెలు బయటేసుకుని, శుభ్రంగా తోమి కడిగి తెల్లని గుడ్డతో తుడిచి ఉదయపు టెండలో బోర్లిస్తుంది.

నిలబడనీయకుండా పనులు పురమాయిస్తుంది.

"ఏంటే పోచీ నిలబడ్డావ్ మొక్కల్లో ఆకులేరేయ్—"

"కూచున్నావేంటే ఆరిన బట్టలు తీసుకొచ్చేయ్"

"ఆ... ఏంటే ఆ దిక్కులు చూడ్డం? అయ్యగారి బట్టలు ఇస్త్రీ చేసెయ్"

"పాప సాక్స్ ఉతికి ఆరేయ్"

"బాబు తెల్ల బూట్లు పాలిష్ చేసెయ్"

"మా గది ఊడ్చి తడి గుడ్డేసెయ్"

ఇలా సాగుతుంది ధోరణి. మరీ నియంతలా పనిచేయిస్తుంది పద్మిని అనుకుంది విమల.

"ఏం? నీకు రాజీ వుందిగా" అంది పద్మిని.

విమల ఆలోచనల్లోంచి తేరుకుని "ఆ... ఏదో వుందిలే—, ఎంతైనా మీ పోచమ్మలా కాదు" అంది.

పద్మిని నవ్వింది పైకి—.

"నీకెన్నిసార్లు చెప్పాను. ఈ గిన్నె మసి చూడు బాగా రుద్దు"

"ఛీ, ఛీ అంతా జిడ్డు — బాగా తోమి తీసుకురా"

"నువ్వా టి.వి. కేసి చూశావంటె వీపు చీరేస్తాను"

"ఏయ్ — రాజీ ఆ కూనిరాగాలాపి, — నోరుమూసుకుని పనిచెయ్యి—"

"ఈ చీర ఇస్త్రీ సరిగ్గా చెయ్యలేదు. అంచుచూడు ఎలా ముడతలుగా వుందో, నువ్వు వీరాసామి దగ్గర కెళ్ళి చేయించుకురా. నీవల్ల కాదులే మనకి బయట ఆముదం వదిలితే గానీ పని జరగదు"

"మనిషిని పెట్టుకుని పోషించినా చేయించుకోవడం తెలియద్దూ— నాకస్సలానేర్వలేదు."

"నా కసలు పని చేయించుకోవడం రాదండీ"—

"ఇలా సాగుతుంది విమల తాండవం. ఇంట్లో పని చేయడానికి కుదిరితే మాత్రం మరీ అంత స్వేచ్ఛ లేకపోతే ఎలాపాపం? పనివాళ్ళయితే మాత్రం? పని బాగా చేయించుకోవాలి. వాళ్ళని బాగా చూడాలి" అనుకుంది. పద్మిని విమల గురించి— ,

పద్మిని అందంగా ముస్తాబై బయటపడింది. ఇద్దరూ చూడముచ్చటగానే వున్నారు.

"నీ చీర చాలా బాగుంది పద్మి" అంది విమల పద్మిని చీరవైపు చూస్తూ"

"ఏమైనా ఈవేళ మాత్రం నీ చీరకే నూటికి నూరు మార్కులు"అంది పద్మిని.

విమల కించిత్ గర్వంతో కులుకుతూ నవ్వి, మరోసారి తన ఎడం చేత్తో సున్నితంగా కుచ్చిళ్ళు సర్దుకుని, కుడి చేత్తో పమిట సవరించుకుంది.—

ఇద్దరూ నడుస్తున్నారు. వాళ్ళు వెళ్ళబోయే విక్టోరియా ఇల్లు మూడు వీధులవతలే—, అందువల్ల వాళ్ళు నడిస్తేనే అందంగా వుంటుంది వారి అందమైన చీరలకి— నడుస్తున్నారు.

చీరలు, నగలు, ధరలు, షేర్లు, మోసాలు, దగాలు, సినిమాలు, ఫ్యాషన్లు, రాజకీయాలు, సమారాధనలు, విప్లవాలు, విష్ణుసహస్రనామాలు, మతకలహాలు— మామూలు మనుషులు, అన్యాయాలు, అమాయకత్వాలు — ఇలా ఏవీ వదలకుండా, దేన్నీ సీరియస్‌గా పట్టించుకోకుండా వారిద్దరూ హాయిగా కబుర్లు చెప్పుకుంటూ అరగంటలో విక్టోరియా ఇంటికి చేరారు.

విక్టోరియా జుత్తుకి చక్కని పిన్ను పెట్టింది. కాస్త అందంగా వుండే ఆమె శ్రద్ధగా రూపురేఖలు దిద్దుకుని మరింత ఆకర్షణీయంగా కనిపించేందుకు ప్రయత్నిస్తుంది.

నిజంగా విక్టోరియా రెడీగా వుందిగానీ ముఖం ఎందుకో కాస్త చిటపటలా వుంది. అయితే వీళ్ళిద్దర్నీ చూడగానే చిరాకు మాయమై చిరునవ్వు మొలిచింది ముఖంలో.

"రెడియేనా"అంది విమల.

"ఓ..... ఒక్క పది నిముషాలు. రాణీ... ఫ్లాస్కులో కాఫీ కప్పుల్లో పోసి తీసుకురా" అంటూ కేకవేసి అందంగా కత్తిరించుకున్న జుట్టు బ్రష్ చేసుకోవడం మొదలు పెట్టింది.

పదేళ్ళ రాణి, జాగ్రత్తగా తొణకకుండా ఖరీదైన కప్పుల్లో పొగలు కక్కే కాఫీ పోసి తీసుకొచ్చి టేబులు మీద పెట్టింది.—

"పొద్దుట నుండి ఒకటే చికాకు— దీని తల్లి వచ్చి అంటుందీ.. ఏంటమ్మా మా పిల్లకి ఎప్పుడూ చద్దన్నమే పెడ్తున్నారంట" అని—,

"ఒళ్ళుమండింది. నాలుగు దులిపి పంపాను" అని ముగించింది.

విక్టోరియా జుత్తుకి చక్కని పిన్ను పెట్టింది. కాస్త అందంగా వుండే ఆమె శ్రద్ధగా రూపు రేఖలు దిద్దుకుని మరింత ఆకర్షణీయంగా కనిపించేందుకు ప్రయత్నిస్తుంది.

ముగ్గురూ బయటకొస్తుంటే చిత్రంగా కళ్ళు చికిలించి నవ్వుతూ "నా సౌభాగ్యం, నా జీవనాధారం చార్లెస్( ఆమెభర్త) అనుకుంటున్నారేమో, కాదు. కానేకాదు నా జీవన సౌభాగ్యం ఈ రాణీయే. ఎవరూ? మనకిప్పుడు వేడి వేడి కాఫీ యిచ్చిందే అదే—, అదే నా జీవన సర్వస్వం—

"ఇందాక వాళ్ళమ్మని దులిపానని కోశానా! అబ్బే, మీ అమ్మాయికి రోజూ వేడి వేడి అన్నమే పెడతాను తల్లీ అని వేడుకున్నాను" అంది అత్యంత నాటకీయంగా. ఆమె మాటల తీరుకు, ఆమె మిత్రురాళ్ళు యిద్దరూ పడీపడీ నవ్వారు. ఆమె కూడా వాళ్ళతో శ్రుతి కలిపింది.

"మరి అంతేగా— రాణి వచ్చి బెడ్ కాఫీ యిస్తేగానీ నేను లేవనే లేము" అంది గారంగా గునుస్తూ.

ముగ్గురూ మంచి కబుర్లలోపడ్డారు.

"ఇంతకీ మనం కేబుల్ టి.వి.లో దేని గురించి మాట్లాడాలి" అంది విమల.

"ఆ... ఏదైతేనేం? మనం దేనిగురించైనా ఆమాత్రం మాట్లాడగలంలే" అంది పద్మిని ధీమాగా.

"అరే! నిన్న రాత్రి తెచ్చి యిచ్చాడు కుర్రాడు కాగితం. నేను చూడనేలేదు అంటూ విక్టోరియా బ్యాగ్‌లోంచి పేపరు తీసింది. గట్టిగా పైకే చదివింది "చైల్డు లేబర్" అనే విషయం. అంటే — బాల కార్మికుల గురించి......